క్లుప్తంగా...

నేడు మహా విందు భోజనం

శంషాబాద్‌: సామాజిక సేవకులు, వ్యాపార వేత్త కందకట్ల సిద్దురెడ్డి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సవేరా హోటల్‌లో మహా విందు భోజనం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గత రెండు నెలలుగా మజ్జిగ, మినరల్‌ వాటర్‌ పంపిణీ చేస్తున్న ఆయన ఆకలితో ఉన్న పేదలు, అభాగ్యులు, అనాథలు, డ్రైవర్లు, పోలీసుల కోసం దాదాపు నాలుగు వేల మందికి అన్ని రకాల వంటకాలతో విందు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పట్టణంలో ఓ ప్రభుత్వ పాఠశాల నిర్మాణాన్ని కూడా పూర్తి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌ కనుమరుగు



బీజేపీ నాయకులతో దేవర శ్రీనివాస్‌ తదితరులు

గోల్కొండ: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌ కనుమరుగు కావడం ఖాయమని బీజేపీ రాష్ట్ర నాయకుడు దేవర శ్రీనివాస్‌ అన్నారు. ఆదివారం ఆయన గోల్కొండ కోటలో గత వారం కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన విద్యార్థుల చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన ఏ ఒక్క వ్యక్తి వల్లనో, ఏ ఒక్క రాజకీయ పార్టీ వల్లనో రాలేదని, ఎందరో పోరాట యోధుల బలిదానాల వల్లే రాష్ట్ర సాధన సాధ్యమైందన్నారు. అయితే నేడు తెలంగాణలో బీఆర్‌ఎస్‌ నాయకులు తమ వల్లే రాష్ట్ర సాధన సాధ్యమైందని గొప్పలు చెప్పుకోవడం విడ్డూరం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్‌ ఉదయ్‌కుమార్‌, ఇంద్రసేనారెడ్డి, ఆశ్విన్‌మోదీ, దేవర వంశీ తదితరులున్నారు.

ప్రజా సమస్యలు తెలుసుకోవడానికే ప్రజాదర్బార్‌



సమస్యలు వింటున్న ఎమ్మెల్యే కౌసర్‌

గోల్కొండ: ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి ప్రతి వారం ప్రజా దర్బార్‌ నిర్వహిస్తున్నట్లు కార్వాన్‌ ఎమ్మెల్యే కౌసర్‌ మోహియుద్దీన్‌ అన్నారు. ఆదివారం ఆయన టోలిచౌకీ మిరాజ్‌ కాలనీలోని ఆయన కార్యాలయంలో ప్రజాదర్బార్‌ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా దర్బార్‌ కార్యక్రమానికి మంచి స్పందన వస్తుందని, ఈ వేదిక ద్వారా ప్రజలు తమ సమస్యలను తన దృష్టికి తెస్తున్నారన్నారు. అంతే కాకుండా అధికారులు సైతం పని దినాల్లో ఈ కార్యక్రమానికి హాజరవుతున్నారన్నారు. దీని ద్వారా అధికారులు ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వాటిని పరిష్కరించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నారని ఆయన అన్నారు. ముఖ్యంగా ఈ వేదిక ద్వారా తనకు వీధి లైట్ల నిర్వహణ, తాగునీటి సమస్యలు, డ్రైనేజీలపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయని కేవలం రెండు రోజుల్లోనే ఆ సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్‌ కార్పొరేటర్‌ మహ్మద్‌ నజీరుద్దీన్‌, నాయకులు ఆలీమ్‌, హబీబ్‌ తదితరులున్నారు.

గుడిమల్కాపూర్‌లో వేగంగా అభివృద్ధి పనులు



పనులను పరిశీలిస్తున్న బీజేపీ నాయకుడు దేవర వంశీ తదితరులు

గోల్కొండ: గుడిమల్కాపూర్‌లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని బీజేపీ నాయకుడు దేవర వంశీ అన్నారు. ఆదివారం ఆయన డివిజన్‌ పరిధిలో జరుగుతున్న డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుడిమల్కాపూర్‌ కార్పొరేటర్‌ దివంగత దేవర కరుణాకర్‌ మృతి చెందిన కూడా తాము ఆయన ఆశయ సాధన కోసం కలిసికట్టుగా ముందుకు సాగుతున్నామన్నారు. దీని కోసం నిరంతరం బస్తీలలో పర్యటిస్తు స్థానికులను కలుసుకొని వారి సమస్యలను తెలుసుకుంటున్నామన్నారు. నాయకులు ప్రభు పూజారీ, మురళీకృష్ణ తదితరులున్నారు.

తెలంగాణ పోలీసింగ్‌ దేశానికే ఆదర్శం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌

- రాజేంద్రనగర్‌ ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్‌
- శంషాబాద్‌లో సురక్ష దినోత్సవ ర్యాలీ

శంషాబాద్‌: పటిష్టమైన తెలంగాణ పోలీస్‌ వ్యవస్థ కారణంగా శాంతిభద్రతల పరిరక్షణలో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా ఉందని రాజేంద్రనగర్‌ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని ప్రధాన చౌరస్తా శంషాబాద్‌ డీసీపీ నారాయణరెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం పోలీసులకు సౌకర్యాలు పెంచడంతో పాటు పెద్ద ఎత్తున పోలీసుల నియామకాన్ని చేపట్టడం జరిగిందన్నారు. నూతన పోలీస్‌ స్టేషన్‌ భవనాలు, కమాండ్‌ కంట్రోల్‌ కార్యాలయం, వాహనాలు సమకూర్చడంతో పాటు ఆధునిక సాంకేతికను అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో శంషాబాద్‌, షాద్‌నగర్‌ ఏసీపీలు భాస్కర్‌, కుశాల్కర్‌, ఆర్‌జీఐఏ సీఐ శ్రీనివాస్‌, మున్సిపల్‌ వైస్‌చైర్మన్‌ బండిగోపాల్‌ యాదవ్‌, నార్సింగి ఏఎంసీ చైర్మన్‌ డి. వెంకేష్‌గౌడ్‌, జెడ్పీటీసీ తన్వీ, బీఆర్‌ఎస్‌ సీనియర్‌నాయకులు ఆర్‌. గణేష్‌ గుప్తా, నీరటి రాజు, శ్రీనివాస్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌ శాఖకు ప్రత్యేక గుర్తింపు

రాజేంద్రనగర్‌: ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అనంతరం పోలీస్‌ శాఖకు ప్రత్యేక గుర్తింపు వచ్చిందని ఎమ్మెల్యే ప్రకాష్‌ గౌడ్‌ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆరాంఘర్‌ చౌరస్తాలో సురక్షా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చొరవ చూపుతుందన్నారు. పోలీసు శాఖకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్‌ డివిజన్‌ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి, ఆర్డీవో చంద్రకళ, కార్పొరేటర్‌ అర్చనజయప్రకాష్‌, బండ్లగూడ మేయర్‌ మహేందర్‌గౌడ్‌, కార్పొరేటర్లు సాగర్‌గౌడ్‌, అస్లాం, ఏసీపీ గంగాధర్‌, ఇన్‌స్పెక్టర్లు నాగేంద్రబాబు, మధు, బోస్‌, ప్రేమ్‌గౌడ్‌, రఘుయాదవ్‌, కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌ జన్మదిన వేడుకలు

బండ్లగూడ: మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొర్రా జ్ఞానేశ్వర్‌ ముదిరాజ్‌ ఆధ్వర్యంలో వికారాబాద్‌లోని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌ నివాసంలో ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాలతో సత్కరించి భారీ కేక్‌ కట్‌ చేయించారు. కార్యక్రమంలో వెంకటేష్‌, మైలారం శ్రీనివాస్‌ పాల్గొన్నారు.



మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న బొర్రా జ్ఞానేశ్వర్‌ ముదిరాజ్‌ తదితరులు



కవ్వగూడలోని ది వుడ్స్‌లో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

‘ప్లాస్టిక్‌ను తరిమికొడదాం’

శంషాబాద్‌ రూరల్‌: ప్లాస్టిక్‌ వాడకాన్ని తగ్గించడంతో పాటు వుడ్స్‌ సుస్థిరతను ప్రోత్సహించేలా ‘ది వుడ్స్‌ శంషాబాద్‌’ ఆధ్వర్యంలో ‘బ్రేక్‌ అప్‌ విత్‌ ప్లాస్టిక్‌’ అనే నినాదంతో ఆదివారం ప్రచారానికి శ్రీకారం చుట్టింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కవ్వగూడలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. వుడ్స్‌లోని ఎగ్జిక్యూటివ్‌ జూనియర్‌ ఇంటర్న్‌ల డైనమిక్‌ బృందం పుస్తకాల కోసం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పాత చీరలు, మెటల్‌ స్ట్రాలు, మగ్‌లు, వెదురు టూత్‌ బ్రష్‌లతో తయారు చేసిన పర్యావరణ అనుకూలమైన పునర్వినియోగ ఫ్యాబ్రిక్‌ బ్యాగ్‌లతో ప్లాస్టిక్‌ కాలుష్య నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మొక్కలు నాటారు.

ప్రారంభానికి సిద్ధంగా అత్తాపూర్‌ పోలీస్‌స్టేషన్‌

అత్తాపూర్‌: అత్తాపూర్‌ పోలీస్‌స్టేషన్‌ అధికారికంగా ప్రారంభానికి సిద్ధమవుతోంది. ఈ పోలీస్‌ స్టేషన్‌ ఏర్పాటుతో రాజేంద్రనగర్‌ పోలీసులపై కొంతమేర భారం తగ్గనుంది. గత కొంత కాలంగా అధికారికంగా పోలీస్‌స్టేషన్‌ ప్రారంభానికి నోచుకోకపోయినా ఔట్‌ పోలీస్‌ స్టేషన్‌ ఏర్పాటుతో సేవలందిస్తున్నారు. ఈ నెల 5న పూర్తిస్థాయి పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్నారు. ఇప్పటికే హుడా కాలనీలో ఉన్న ఔట్‌ పోలీస్‌ స్టేషన్‌ను అత్తాపూర్‌ పోలీస్‌స్టేషన్‌గా అప్‌గ్రేడ్‌ చేస్తూ అందుకు కావాల్సిన సిబ్బందిని నియమించారు. ఇద్దరు ఎస్సైలు, ముగ్గురు ఏఎస్సైలు, నలుగురు జన్‌దార్‌లు, 25 మంది పోలీస్‌ కానిస్టేబుళ్లతో ఒక ఇన్‌స్పెక్టర్‌ను నియమించారు. సైబరాబాద్‌ పరిధిలో ఉన్న రౌడీషీటర్లలో దాదాపు 75–80 శాతం వరకు రాజేంద్రనగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోనే ఉండటం గమనార్హం. అనేక సమస్యాత్మక ప్రాంతాలు ఉన్న నేపథ్యంలో ఉన్నతాధికారులు అత్తాపూర్‌లో ప్రత్యేక పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. అత్తాపూర్‌ పోలీస్‌స్టేషన్‌ ప్రారంభంతో ఇటు మైలార్‌దేవ్‌పల్లి, అటు రాజేంద్రనగర్‌ పోలీసులపై భారం తగ్గుతుంది.



అత్తాపూర్‌ పోలీస్‌స్టేషన్‌

ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించాలి

అత్తాపూర్‌: విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలతో పాటు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలని పాఠశాల విద్యా కమిటీ చైర్మన్లు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రొఫెసర్‌ జయశంకర్‌ బడిబాట కార్యక్రమం పేరుతో బయట ఉన్న బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు అధికారులు, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. రాజేంద్రనగర్‌ పట్టణ పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేకపోవడంతో 10వ తరగతిలో ఉత్తీర్ణత శాతం తగ్గిపోతుందన్నారు. రాజేంద్రనగర్‌ పట్టణ పరిధిలో 35 ప్రైమరీ పాఠశాలలు, 8 జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలు, ఒక ఉర్దూ మీడియం హై స్కూల్‌, నాలుగు యూపీఎస్‌లతో పాఠశాలలు ఉన్నాయి. ఒకే క్యాంపస్‌లో ప్రైమరీ పాఠశాలతో పాటు ఉన్నత పాఠశాల కొనసాగుతోంది. దీంతో పాఠశాల ఆవరణ విద్యార్థులకు అనుగుణంగా లేకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మన ఊరు, మన బడి కార్యక్రమంలో భాగంగా అత్తాపూర్‌ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలను అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు. విద్యార్థులకు అవసరమైన తరగతి గదులు నిర్మించి పాఠశాల అభివృద్ధికి శ్రీకారం చుట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు.



అత్తాపూర్‌ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల ముఖద్వారం

హనుమాన్‌నగర్‌ బస్తీ వాసులకు పట్టాలు ఇవ్వండి

రాజేంద్రనగర్‌: ఆరు దశాబ్దాలుగా ఇంటి పట్టాల కోసం పడిగాపులుకాస్తున్న రాజేంద్రనగర్‌ డివిజన్‌ పరిధిలోని హనుమాన్‌నగర్‌ బస్తీ వాసులకు తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పట్టాలు ఇవ్వాలని డివిజన్‌ మజ్లిస్‌ పార్టీ అధ్యక్షుడు షేక్‌ రియాజ్‌ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం హనుమాన్‌నగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 60 ఏళ్ల క్రితం వివిధ ప్రాంతాల నుంచి రాజేంద్రనగర్‌కు వలస వచ్చిన కుటుంబాలు గుడిసెలు వేసుకుని నివాసం ఉంటూ స్థానికంగా కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారన్నారు. ప్రభుత్వం పలు మార్లు హనుమాన్‌నగర్‌లోని ప్రజలకు ఇళ్ల పట్టాల పేరుతో సర్వేలు నిర్వహించిందని, ఇంటింటికి తిరుగుతూ లబ్ధిదారులను గుర్తించి పట్టాలను అందిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఆరు దశాబ్దాలుగా పట్టాల కోసం బస్తీ వాసులు ఎదురు చూస్తున్నారని ఇప్పటికైనా బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం వారికి పట్టాలు మంజూరు చేయాలన్నారు. క్రమబద్ధీకరణ కోసం జారీ చేసిన 58,59 జీవోల ప్రకారం బస్తీ వాసులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. పట్టాల సమస్యను హైదరాబాద్‌ పార్లమెంట్‌ సభ్యుడు, మజ్లిస్‌ అధినేత ఒవైసీ దృష్టికి తీసుకువెళతామన్నారు. హనుమాన్‌నగర్‌ బస్తీ వాసులకు పట్టాలు అందించేంత వరకు మజ్లిస్‌ పార్టీ అండగా ఉంటుందన్నారు.



డివిజన్‌ మజ్లిస్‌ పార్టీ అధ్యక్షుడు షేక్‌ రియాజ్‌

స్కూల్‌ పక్కన ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించండి

అత్తాపూర్‌: ప్రభుత్వ పాఠశాల ఆవరణలో విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ ఏర్పాటు చేయడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల పక్కన ఉన్న విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌, తీగలను తొలగించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్‌ వార్డు అధ్యక్షులు జి.భాస్కర్‌ ఆదివారం విద్యుత్‌ శాఖ అధికారులను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్తాపూర్‌ డివిజన్‌ హైదర్‌గూడ ప్రభుత్వ పాఠశాల పక్కనే అధికారులు విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో అక్కడ చదువుకునే విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉంది. విద్యుత్‌ తీగలు సైతం కింద నుంచి వెళుతుండటంతో విద్యార్థులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని లిఖితపూర్వకంగా కోరామన్నారు. సానుకూలంగా స్పందించిన అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.



ప్రభుత్వ పాఠశాల ఎదుట వేలాడుతున్న విద్యుత్‌ తీగలు

6న వీర బ్రహ్మేంద్ర స్వామి కల్యాణం

రాజేంద్రనగర్‌: రాజేంద్రనగర్‌ బుద్వేల్‌లోని శివపోతులూరు వీరబ్రహ్మం గారి మఠం 21వ వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు ధర్మకర్తల మండలి సభ్యులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం గణపతి పూజ, గరుడ స్తంభ పూజ, స్వామి వారి అభిషేకం, పుణ్యవచనం, వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవింద మాంబ కల్యాణ మహోత్సవం, హోమం, అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మఠాన్ని స్థాపించి 21 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

కొనసాగుతున్న రేషన్‌ డీలర్ల సమ్మె

శంషాబాద్‌: గౌరవ వేతనం ఇవ్వాలనే ప్రధాన డిమాండ్‌తో రేషన్‌ డీలర్లు చేపట్టిన సమ్మె ఆదివారం రెండో రోజుకు చేరుకుంది. రేషన్‌ డీలర్ల రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు శంషాబాద్‌, రాజేంద్రనగర్‌ సర్కిల్‌లో సుమారు 90 మందికి పైగా డీలర్లు దుకాణాలను మూసివేసి సమ్మెలో పాల్గొన్నారు. ఈ నెల 5 నుంచి సమ్మె చేయాలని నిర్ణయించిన డీలర్లు ఈ నెల 3 నుంచి దుకాణాలు తెరవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో రెండురోజుల ముందుగానే సమ్మెను ప్రారంభించినట్లు తెలిపారు. కరోనా సమయంలోనూ ప్రాణాలను పణంగా పెట్టి సేవలందించిన డీలర్ల న్యాయమైన డిమాండ్లను ఆమోదించాలన్నారు. సమ్మెపై ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసినప్పటికి రేషన్‌ డీలర్లందరూ సంఘటితంగా సమ్మెలో పాల్గొంటున్నారని తెలిపారు.

తొమ్మిది మందికి ‘బ్లాక్‌ బెల్ట్‌’



బ్లాక్‌ బెల్ట్‌ సాధించిన విద్యార్థులతో నిర్వాహకులు

రాజేంద్రనగర్‌: బుద్వేల్‌లోని వారియర్స్‌ కరాటే ఇంటర్నేషనల్‌కు చెందిన 9 మంది విద్యార్థులు బ్లాక్‌ బెల్ట్‌కు అర్హత సాధించినట్లు నిర్వాహకుడు రవికిరణ్‌ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వారియర్స్‌ కరాటే ఇంటర్నేషనల్‌ ఆధ్వర్యంలో బ్లాక్‌ బెల్ట్‌ కోసం మూడు రోజులుగా వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో నగరవ్యాప్తంగా 60 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. వారిలో బుద్వేల్‌కు చెందిన తొమ్మిది మంది క్రీడాకారులు బ్లాక్‌ బెల్ట్‌ అర్హత సాధించారన్నారు. ఈ సందర్భంగా వారిని రవికిరణ్‌ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బ్లాక్‌ బెల్ట్‌ చీఫ్‌ ఎగ్జామినర్‌ మల్లేశ్వర్‌, ఇంద్రసేనా, నందులాల్‌, వీరాసింగ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఓఎల్‌ఎక్స్‌లో ఫర్నిచర్‌ పేరుతో రూ. 90 వేలు టోకరా

రాజేంద్రనగర్‌: ఓఎల్‌ఎక్స్‌లో ఫర్నిచర్‌ అమ్మకం పేరుతో సైబర్‌ నేరగాళ్లు ఓ మహిళ నుంచి రూ.90 వేలు కాజేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు రాజేంద్రనగర్‌ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వివరాల్లోకి వెళితే.. శివరాంపల్లి ప్రాంతానికి చెందిన మహిళ ఓ ప్రైవేట్‌ ఏజెన్సీలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తుంది. ఓఎల్‌ఎక్స్‌లో రూ. 6 వేలకు ఫర్నిచర్‌ అమ్మకానికి ఉన్నట్లు ప్రకటన చూసిన ఆమె అందులో పేర్కొన్న ఫోన్‌ నెంబర్‌ను సంప్రదించింది. అవతలి వ్యక్తి తాను ఆర్మీ ఉద్యోగినని ఇళ్లు మారుతున్నందున ఫర్నిచర్‌ విక్రయిస్తున్నట్లు తెలిపారు. మొదట రూ.2500 ఆన్‌లైన్‌లో పేమెంట్‌ చేయాలని కోరడంతో ఆమె అతడికి నగదు బదిలీ చేసింది. ఆ తర్వాత నిందితుడు అలా వేయవద్దని మొదట రూ.2 వేలు, ఆ తర్వాత రూ. 4999, అనంతరం ఒక్క రూపాయి వేయాలని సూచించాడు. దానికి బదులు తాను క్యూఆర్‌ కోడ్‌ పంపిస్తానని స్కాన్‌ చేసినా ఇబ్బంది లేదన్నారు. తాను ఆర్మీ ఉద్యోగిని అయినందున నేరుగా నగదు తన ఖాతాలోకి రాదన్నారు. అతడి మాటలు నమ్మిన బాధితురాలు క్యూఆర్‌ కోడ్‌ను స్కాన్‌ చేసింది. నిందితుడు ఆమెను మాటల్లో పెట్టి రూ.90 వేలు కాజేశాడు. జీరో బ్యాలెన్స్‌ కాగానే ఫోన్‌ కట్‌ చేసి స్విచ్ఛ్‌ ఆఫ్‌ చేశాడు. ఈ వ్యవహారం అంతా శనివారం సాయంత్రం వరకు సాగింది. తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు ఆదివారం ఉదయం రాజేంద్రనగర్‌ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సాయిరామ్‌ కాలనీ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ

మణికొండ: మణికొండ మున్సిపల్‌ పరిధిలోని సాయిరామ్‌ కాలనీలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని మణికొండ మున్సిపల్‌ చైర్మన్‌ నరేందర్‌ అన్నారు. మణికొండ మున్సిపల్‌ పరిధి, పుప్పాలగూడలోని సాయిరామ్‌ కాలనీ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులు ఆదివారం చైర్మన్‌ నరేందర్‌నులిసి పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయిరామ్‌ కాలనీ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. కాలనీ సభ్యులు సమష్టిగా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నారన్నారు. కాలనీ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయన్నారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని వాటి పరిష్కారం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్‌ చైర్మన్‌ జె.రామస్వామి, అధ్యక్షులు కె.పాలాపతి, ఉపాధ్యక్షులు ఎస్‌.యాదయ్యగౌడ్‌, ప్రధాన కార్యదర్శి జి.హనుమంతరావు, సంయుక్త కార్యదర్శి బి.రాజు, కోశాధికారి కె.నరేందర్‌, ఆర్గనైజింగ్‌ సెక్రటరీ సి.హెచ్‌.నర్సింగ్‌రావు, కె.యాదయ్య, సభ్యులు ఎస్‌.మహేష్‌కుమార్‌, జి.సత్యానారాయణ, ఎస్‌.గణేష్‌, సూర్యకాంత్‌, డి.భావరీ, డి.లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్‌ చైర్మన్‌ నరేందర్‌ను సన్మానిస్తున్న సాయిరామ్‌ కాలనీ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ సభ్యులు

ఘనంగా శివాంజనేయ స్వామి దేవాలయ వార్షికోత్సవం



అభిషేకంలో పాల్గొన్న దంపతులు



హోమంలో పాల్గొన్న భక్తులు

రాజేంద్రనగర్‌: రాజేంద్రనగర్‌ బుద్వేల్‌లోని శివాంజనేయ స్వామి దేవాలయ 30వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తెల్లవారుజామున శివాలయంలో అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ దేవాలయాన్ని పునఃనిర్మించి 30 సంవత్సరాలు పూర్తి అవుతున్నందున ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, హోమాలు నిర్వహించినట్లు తెలిపారు.

మైనార్టీల సమస్యలు పరిష్కరించండి

ఎమ్మెల్యే గాంధీకి మైనార్టీ ప్రతినిధుల బృందం వినతి



ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం సమర్పిస్తున్న ముస్లిం నాయకులు

రాయదుర్గం: మైనార్టీల సమస్యలను పరిష్కరించాలని బీఆర్‌ఎస్‌ పార్టీకి చెందిన పలువురు ముస్లిం నాయకులు ప్రభుత్వ విప్‌, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీని కోరారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేశారు. గచ్చిబౌలి డివిజన్‌ ఖాజాగూడలోని శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని, ప్రహరీ నిర్మించాలని , నానక్‌రాంగూడ లోని శ్మశాన వాటికను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని కోరారు. నియోజకవర్గ పరిధిలో ముస్లింలకు ప్రత్యేకంగా మైనార్టీ ఫంక్షన్‌ హాల్‌ నిర్మాణం చేపట్టాలని కోరారు. పలు కాలనీలు, బస్తీల్లో ముస్లిం శ్మశాన వాటికలకు ఏర్పాటుకు స్థలం కేటాయించాలని, అర్హులైన ముస్లింలకు డబుల్‌ బెడ్‌ రూమ్‌ ఇళ్లను మంజూరు చేయాలన్నారు. బస్తీ దవాఖానాల సంఖ్య ను పెంచాలని కోరారు.

దశవారీగా సమస్యల పరిష్కారం

దశలవారీగా అన్ని సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ వారికి హామీ ఇచ్చారు. వినతిపత్రం స్వీకరించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్‌ నాయకత్వంలోని ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. షాదీ ముబారక్‌, రంజాన్‌ తోఫా, మైనార్టీ పాఠశాలలు, మైనార్టీ గురుకులాలను ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యను అందిస్తుందన్నారు. ముస్లిం శ్మశాన వాటికల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రత్యేకంగా ఫంక్షన్‌ హాల్‌ నిర్మాణా నికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు, ముస్లింలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా సహకరిస్తానని హామీ ఇచ్చారు. కార్య క్రమంలో బీఆర్‌ఎస్‌ నాయకులు హబీబ్‌, అక్బర్‌, సయ్యద్‌పాషా, ఖాదర్‌ఖాన్‌, సలావుద్దీన్‌, నవాజ్‌, సయ్యద్‌ సర్వర్‌, నయీమ్‌, మహ్మద్‌ అలీ, హుస్సేన్‌, జహీర్‌ఖాన్‌, యూసుఫ్‌పాషా పాల్గొన్నారు.

ఓపెన్‌ హౌస్‌ కార్యక్రమం ద్వారా పోలీస్‌ విధులపై అవగాహన

జియాగూడ: ఓపెన్‌ హౌస్‌ కార్యక్రమం ద్వారా పోలీసులు నిర్వహించే బాధ్యతలను ప్రజలకు వివరించడం హర్షణీయమని ఎమ్మెల్యే కౌసర్‌ మొహియుద్దీన్‌ అన్నారు. ఈ మేరకు ఆదివారం కుల్సుంపురా పోలీస్‌స్టేషన్‌లో తెలంగాణ అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా ఇన్‌స్పెక్టర్‌ అశోక్‌కుమార్‌ ఆధ్వర్యంలో ఓపెన్‌ హౌస్‌ సురక్ష దినోత్సవ కార్యక్రమం ఏర్పాటైంది. ముఖ్య అతిథిగా హాజరైన కౌసర్‌ మొహియుద్దీన్‌, సౌత్‌వెస్ట్‌ జోన్‌ డీసీపీ కిరణ్‌ ఖారే ఓపెన్‌హౌస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీసులు పోలీస్‌ స్టేషన్‌లోని ఆయుధాల పనితీరు గురించి వివరించారు. విధులు, అధికారాల గురించి హౌస్‌కు హాజరైన వారికి వివరించారు. ప్రజలు పోలీస్‌స్టేషన్‌లో ఎలా ఫిర్యాదు చేయాలి, ఆయుధాలను ఎలా ఉపయోగిస్తారు, ఎప్పుడు వాడాలన్న విషయాలను పోలీసు సిబ్బంది తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రహ్మత్‌బేగ్‌, కార్వాన్‌ నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జ్‌ అమర్‌సింగ్‌, బీఆర్‌ఎస్‌ కార్యవర్గ సభ్యుడు కాపూరి వెంకటేష్‌, నర్మద, పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని బస్తీ కమిటీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



పోలీస్‌ విధులను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కౌసర్‌, డీసీపీ కిరణ్‌ ఖారే

అలరించిన అస్త్ర విన్యాసం

గచ్చిబౌలి: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సైబరాబాద్‌ పోలీసుల ఆధ్వర్యంలో ఆదివారం పోలీసు సురక్ష దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొండాపూర్‌లోని ఏఎంబీ మాల్‌ మెయిన్‌ ఆట్రియంలో స్పెషల్‌ పోలీస్‌ టీమ్‌తో సైలెంట్‌ ఆర్మ్స్‌ డ్రిల్‌ నిర్వహించారు. 50 మంది సిబ్బంది నిర్వహించిన ఈ డ్రిల్‌ ఆద్యంతం ఆసక్తిగా సాగింది. స్పెషల్‌ పోలీస్‌ బృందం విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సీఎస్‌డబ్ల్యూ ఏడీసీపీ వెంకటరెడ్డి, స్పెషల్‌ టీమ్‌ ఇన్‌చార్జీ ఇన్‌స్పెక్టర్‌ సిద్ధార్థనాయక్‌, గచ్చిబౌలి ఎస్‌ఐ సురేందర్‌రెడ్డి, ఆర్‌ఐ అరుణ్‌కుమార్‌, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.







ఏఎంబీ మాల్‌లో స్పెషల్‌ పోలీస్‌ టీమ్‌ సైలెంట్‌ ఆర్మ్స్‌ డ్రిల్‌ నిర్వహిస్తున్న దృశ్యాలు